# పేడ దెయ్యం

సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి

**పొద్దున్నే సద్దిబువ్వ తాగి చొక్కాకు చేతులు తుడుచుకొంటా యీధిలోకొచ్చి ఆ పక్కా, యీపక్కా పారజూసినా.**

**దేవలం కాడ జైగాడు కనబన్నెడు. వాని చేతిలో పేడబుట్ట వుంది. బుజాన తలగుడ్డ వుంది. నన్ను చూడగానే తలెగరేస్తా అట్లా చెయ్యి యిసిరి తూరుపీధినబడి పరిగెత్తిండు. నాకింక కాల్నిలబడలే.**

ఇంట్లేకి పోయి తుండుగుడ్డ బుజానేసుకొని, మూలనున్నె మా యమ్మ చెప్పలు కాల్లకు తొడుక్కున్నే. బర్రెతోలుతో కుట్టిన కర్రట్ట చెప్పులయితేనే ఎదుర్రాల్లకూ తుమ్మ ముల్లులకూ తట్టుకొనేది.



బరుగొడ్ల కొట్టంలేకి పోయి పేడబుట్ట తీసుకొని, దిబ్బకవతల తెట్టుగోడ దాటుకొని ఆన్నుంచి అటే అయ్యగారికుంట దిక్కు ఎగమల్లినా. కొలిమి మాని కాడున్న మా నాయన కండ్లబడకుండా గమిలిదాటి తొట్టిబాయికాడి మొద్దు చింతమాను కిందికి చేరుకున్నే.

ఊర్లో పిల్లోల్లంతా ఆన్నే వుండారు.

కొందరు బుట్టల్లో ఒకటి అరా పేడకల్లు గూడా బేసుకోనుండారు.

ఇంకొందరు పిల్లోల్లు నీలితొట్లకు పక్కన బిడువులో బుట్టల్లోని పేడను కుప్పేసి తంగేడు పుల్లనో, పలుగురాతి ముక్కనో పైన గుర్తుగా చెక్కి పెట్టుండారు.

గోలుగుండ్లాట, బొంగరాలాట, తొక్కుడుబిల్ల, కుంటిల్లు, గిజుగోలు, తిట్టుకోడాలూ, తన్నుకోడాలూ...అదంతా సూస్తా తొర్రినోటితో నవ్వుకొనే ముసిలోల్లూ...చెట్టుకిందంతా గోలగోలగా వుంది.

నీలితొట్టి గోడల మీంద కూకొని అచ్చెనగాయలు ఎగరేస్తా నా దిక్కు యిచిత్రంగా చూసినారు ఆడపిల్లోల్లు.

అందర్లోకి పెద్ద సదువు సదివే పిల్లోన్ని నేనొక్కన్నే. నిరుడు వూర్లో సదువయిపించుకొని నర్సాపురం ఐస్కూల్లో ఆరో తరగతి జేరి యియ్యేడంతా. తిరిగినా ఈ సెలవులైపోతే ఏడుకుపోవాల. అట్లాంటి ఐస్కూలు స్టూడెంటు పేడకు వొచ్చేది యిచిత్రమే గదా!

జయన్న గోలుగుండ్లాట కాడుండాడు.

నాగ్గూడా ఆడాలని మూస బేసి చేతి వేల్లు పీకినాయి. ఆట కాడికి పోబోతావుంటే గోడమీద అచ్చెనగాయలాడతా వున్నె రామతొలిసి నా దిక్కుజూసి ''ఏం పిల్లోడా! నువ్వూ పేడకొచ్చినావా?'' అనింది.

నాకు బో కోపమొచ్చింది.

ఆ పిల్ల నా యీడుదే. పేద్ద ఆడ ముత్తయిదువలా ఫోజుగొట్టి సదూకున్నోన్ని నన్ను పట్టుకొని 'పిల్లోడా!' అంటాంది.

మాటకు మాట యిదిలించుదామని నోరెత్తబోయినా గాని అప్పుడే నాపక్కనున్నె సుబ్బవ్వ కలుగజేసుకొన్నెది. ''పేడగ్గాక నిన్ను లేపకపోడానికి వొచ్చినాడనుకొన్నెవంటనే పిల్లా!'' అనింది. సున్నపుపొడి నోట యిదిలించుకొంటా.

నాకయితే బోసిగ్గేసింది.

ఆ పిల్లదిక్కు ఓరగా జూసి కిసుక్కున నవ్వినా.

దానికి మాత్రం సిగ్గు సెరం లేనెట్టుంది.

నాదిక్కు కొరకొర జూసింది.

''ఏమబ్బే! లేపకపోతావా? మొగం సూడు.. లేపకపొయ్యేమొగమే..'' అనింది నామీందికి చెయ్యి చాపుతా.

నేను పళ్లెత్తి ఒక్కమాట మాట్లాడలే. తనూ సుబ్బవ్వా మాటలు యిసురుకొన్నెరు. మరి నా మీందికెందుకో ఒంటికాలు మీంద వస్తాంది.

నాకు రవరవ కోపమొచ్చింది.

''ఏం?'' నీ చీమిడి ముక్కుల మొగమాల లేదా?'' అన్నే ఆ మాటకు గట్టిగా ఎగజీదింది రామతులసి.

''నీదే గండుబిల్లి మొగం.'' అనింది.

అది బయపడే రకం గాదు. కచ్చెపిల్ల. మాటకు మాట ఎగబెట్టకుంటే బతకదు.

నేనిప్పుడు తగ్గితే సావాసగాల్లకాడ లోకువ యితా.

అందుకే ఎదురు తిరిగినా.

ఇద్దరం కాసేపు తిట్టుకొన్నెం.

కడకు నేను మా ఇంగ్లీషు మేడం సాగదీసి వాడే ఇంగ్లీషు తిట్లను ధాటిగా ప్రయోగించినా.

దాంతో నాదే పైచేయి అయ్యింది.

ఆ పిల్లకు తిక్కరేగినట్టుంది.

''అడ్డ నాబట్టా! ఆడపిల్లోల్లతో కొట్లాడను సిగ్గులే నీకు!'' అంటా గోడదిగి లంగాను గోచి చెక్కి పెద పెద్ద తిట్లకు తిరుక్కునింది.

నాగ్గూడా తిట్లొస్తయిగాని జైగాడొచ్చి చెయ్యి పట్టుకొని పక్కకు యిగ్గేతలికి తిట్టడానికి కుదరలే.

''ఆకచ్చెదాంతో ఏం పనిరా సోమీ!..నువ్వు రారా పోదాం రా..'' అంటా నన్నుక్కన్నించి జ్యోతి వాగు దిక్కు తీసకపోయిండు.

వాగులో గరికె నాకేడతా వుండాయి బరుగొడ్లు.

వాటెను కదలదోలితే పేడ బెడ్తాయి.

బుటికె నిండా పేడబేసుకొని మొగోని లెక్కన వాల్ల ముందే యింటికి పోవాల. దిబ్బలో బెయ్యాల.

వంకదరినున్న వాయల మందను విరిచి మెల్లగా జేసి నాలుగు గొడ్లను అదిలించినామో లేదో ఎనకనించి కేకలు.

''పాపం పిల్లోల్లు వొడిబడి వొచ్చిన్రేమో! ఆదరా బాదరా గొడ్లకాడికి పోతాన్రు. యాడేడున్నె గొడ్లన్నిట్నీ మల్లేసి తెచ్చి వంకలో నిల్దోలింది యీ బోడిగాల్ల కోసమేనేమో!'' అంటా రామతులసికి తోడుయింగా నలుగురు ఆడపిల్లోల్లు బిరబిర మాకాడికొచ్చినారు.

''ఏబ్బ..అదో నల్లబర్రె పేడ బెడ్తాంది.''

''ఏబ్బ అదిగదిగో గూనిది తోకెత్తింది...''

''ఏబ్బ.. బోడికొమ్ముల్దాన్ని నేన్జూసినా..''

''ఏబ్బ.. అదో సెట్టుసాటున ఎర్రపడ్డ పేడ బెడ్తాంది..''

''ఏబ్బ... ఏబ్బ..'' అంటా గొడ్ల చుట్టూ తిరుక్కున్నెరు.

ఏ బర్రె పేడబెడ్తాందో మేం కనిపెట్టేలోపలే వాల్లు బరుగొడ్ల ఎనక్కి జేరుకొని తోకలకాడ పేడ బుట్టలు ఆన్చుతుండారు. రవ్వంత తోకెత్తిన బరుగొడ్డు ముడ్డి కాడంతా బుట్ట ఆన్చుకొని పోతా వుండారు. మా పక్క బర్రె పేడ బెట్టినా '' ఏబ్బ..కర్రెది..నేన్జూసినా...'' అంటా పరుగెత్తికొచ్చి మమ్మల్ను పక్కకుదోసి పేడచేసుకుంటుండారు.

ఒక్క పేడ తపక బుట్టలో బేసుకోవాలన్నే వాల్లతో కొట్లాడాల.

బర్రెల్ను మల్లేసుకొచ్చినామనే సొతంత్రత వాల్ల కుంది.

కచ్చెదాన్లతో ఏగలేమని తెలిసిపోయింది.

లోపల్లోపల తిట్టుకొంటా ఎనక్కెనక్కి సర్దుకొన్నెం.

బరుగొడ్డు తోకెంటా బుట్ట పట్కుని పైటేల దాంకా తిరిగేంత ఓపిక మాకు లేదనుకొన్నెం.

''యీ కచ్చెదాన్లకాడెందుకు. బరక్కుపోదాం పారా..'' జైగాడు అనేసరికి నేనుగూడా 'సై' అన్నే.

బరకకు పోతే ఆవుల పేడ దొరుకుతాది. ఎండిన పేడయితే అచ్చులచ్చులుగా బుట్టనిండా పేర్చుకొన్నే అలువుగా మోసకరావొచ్చు.

పిచ్చిగాడు, రాముడు మాకు తోడయినాడు.

తొట్టి బాయి దిక్కుగూడా చూడకుండా బుట్టలు భుజాన పెట్టుకొని పోతు మొగోల్ల మాదిరి కాలి కొద్దీ బరకదోవబట్టినం.

ఊరికి పడమటి దిక్కున సాగుజేసే పొలాలు దాటితే నల్లమల కొదల్దాకా బరకే. ఉప్పువాగుదాకా పోయినా బరకే. గాదివింగు దాకా పోయినా బరకే. బరక్కుపోయి నల్లటి సిగినమంటి ఆవు పేడ దెచ్చినామంటే పోతు పాలెగాల్లకిందే లెఖ్క. ఆవుపేడ దిబ్బలో పడిందెంటే సాలు అదృష్టం పెరుగుతాదంట.

చేలల్లో అక్కడక్కడ పేడతట్టలు నెత్తిన పెట్టుకొని ఆడమాసులు తిరుగుతా వుండారు. గొడ్డు కనబడితే సాలు ఎనకంబడి పోతావుండారు ' ఏబ్బ ఏబ్బ' అనుకుంటా.

చుట్టుపక్కల పేడ తపక గూడా దొరికేట్టు లేదు.

ఉప్పువాగు జేడెలెంబడి మాసులే వుండారు.

పైటేల్దాకా పేడకడి కోసం ఎంపర్లాడ్తావుంటారు ఆడోల్లంతా. మాపిటేల చెరువులో వొండుమట్టి ఎత్తకపోయి దిబ్బలో బేస్తరు. మిట్టమద్దేన్నం చెట్ల కింది ఆకుపాట్టు వుండ్చక పోతుంటారు. ఎండాకాలమంతా ఆడోల్లకు యిదేపని.

ఉప్పువాగు దాటినాక ఏ పక్క జూసినా బరకే కనబన్నెది. కలవె, బలస, నేలరేగు, తంగేడు చెట్లతో, ఎండిన వూపతో, సన్నసన్న వంకలతో, సన్నని కాలిదోవల్తో కనుచూపుమేరా బరకే. ఉన్నెట్టుండి కంపపొదల కిందనుంచి బుర్రున ఎగిరే పూరేలి పిట్లు, వంక జేడెల్లో గునగున పరిగెత్తి దాక్కొనే కుందేల్లూ, బరక కడ్డంగా రబ్బరు చెండులా చెంగు చెంగున ఎగురుతా పోయే జింకలూ... ఇవన్నీ సూస్తాంటే.. నాకయితే బో కులాసగా వుంది.

ఉప్పొగు వెంబడి అట్లా అట్లా తిరుగుతా వుండామేగాని గాడేగు దిక్కు పోడానికి గుండెలు చాల్లే. ఇక్కడ పేడ దొరకలే.

అంతలో డిప్పొగు జేదెల్లో రంగత్త కనబన్నెది.

''ఏమబ్బె! పేడకా?'' అనింది.

''అవుత్తా!'' జైగాడు చెప్పిండు.

''యీపక్క యేడుందబ్బే పేడ? గాడేగుదాకా పోతేగాని దొరకదు.'' చెప్పింది.

''నువ్వు పోతాండవాత్తా?'' అడిగినా.

'' ఏం.. వస్తారు?''

'సై' అంటా గెంతులేసిన.

''రాండి. అందరిబుట్ల నిండా పేడ జూపిచ్చు'' అంటా ముందు నడిచింది.

బరకలో అక్కడక్కడా పచ్చిపేడ కనబన్నె.. ఎవ్వరం బేసుకోలే- ఎవురు మోస్తారని. దాడేగు దిక్కు పోతాండం గదా! వొట్టి పేడ దొరుకుతుందనే నిబ్బరం.

''ఏమబ్బే! ఆ పేడకల్లు బేసుకుంటేం...'' నిలబడి వేలెత్తి చూపుతా అనింది రంగత్త.

ఆ దిక్కుగా సూస్తే- తంగేడు పొదపక్కగా నల్లగా నిగనిగలాడతా సిగినమంటి

పచ్చిపేడ...

ఇంతదూరమొచ్చి పచ్చిపేడ మోసకపోవడమా?






సినిమాలతో పెద్దగా సక్సెస్ సాధించలేకపోయిన మహిమ బాయ్ ఫ్రెండ్స్‌ను మార్చడంలో, వారితో పబ్లిగ్గా తిరగడంలో మాత్రం పెద్ద సంచలనం సృష్టిస్తోంది. మొన్నటివరకూ టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్‌తో చెట్టపట్టాలేసుకు తిరిగిన మహిమ పేస్‌తో దోస్తీకి కటీఫ్ చెప్పేసి వివేక్ ఒబరాయ్‌తో డేటింగ్‌కు గ్రీన్ సిగ్నలిచ్చింది. వివేక్ ఇప్పుడామె కొత్త బాయ్‌ఫ్రెండ్. వివేక్ ఆమెకు అంతగా నచ్చడానిక్కారణం తరచు తనను పొగడ్డమేనట. ''నాకు నచ్చిన వాళ్లతో సంబంధం పెట్టుకున్నంత మాత్రాన నా ఇష్టాయిష్టాలను వారిపై రుద్దను; అట్లాగని వాళ్లకి ఇష్టం వచ్చినట్లు నేను ప్రవర్తించాల్సిన అవసరం నాకెంత మాత్రం లేదు అంటోంది మహిమా.అన్నట్టు స్త్రీలను మెచ్చుకునే మగవాళ్లంటే మహిమాకు మహా ఇష్టముట!

ఆ మాటే చెప్పినాము ఆమెతో.

పకపక నవ్వింది అత్త.

''అది పచ్చి పేడగాదబ్బె! వొట్టి పేడే...'' చెప్పింది.

అనుమానం తీరక దగ్గరికి పోయి వేలుతో వొత్తి సూస్తే....నిజంగానే వొట్టి పేడ... వేల్లు దూర్చి లేపితే- వూపముల్లులు అడుగంతా అంటుకొని... రెండు అరచేతులంత వెడల్పుగా...

పేడకడి గురించి రంగత్తకు తెలిసినంతగా ఎవ్వురికీ తెల్దని అందరూ అంటుంటే ఏమోనను కొన్నెం... నిజమే...

నాకెందుకో ఆమె ఎనకపోతాంటే ధైర్యంగా వుంది. ఆమె సూపించే పేడతపకలు యేరి బుటికెలో బేసుకొంటాంటే కుశాలగా వుంది. నల్లగా అల్లనేరేడు పండట్లా వున్నె రంగత్త తోడుంటే ఏ పిల్లోనికైనా ధైర్యమేనంట. ఆమె జోలికి పోవాలంటే ఏ మొగోనికైనా బయ్యమేనంట.

రంగత్త ముండగల్లాలు. పుట్టింటి పంచన జేరి వుంది. ఎప్పుడూ పేడగంప పట్టుకొని చేలల్లో, బరకల్లో, వంకల్లో వాగుల్లో తిరుగుతా వుంటాది. ఆమెకు మొగోల్ల బయ్యం లేదంట. దెయ్యాల బయ్యం లేదంట. ఆమెన్జూసి దెయ్యాలే బయపడ్తాయని అరుగుల కాడ అనుకుంటా వుంటారు. రోజా మూడుసార్లన్నా పేడగంప దిబ్బల్లో బోర్లించంది పానం నిలబడదంట. అట్లాంటిది యిప్పుడేమో ఒక్క పేడకడిగూడా వేసుకోకుండా అన్నీ మాకే సూపిస్తాంది. ఇదేదో యిచిత్రంగా వుంది.

దాడివాగు దగ్గరబడింది.

బొద్దేకు తీగెలు అల్లుకొన్నె పెద్దపెద్ద కంపపొదలు దరుల నిండా వుండాయి. చెట్ల లోపల్నించి కొత్త కొత్త పిట్టల అరుపులు వినిపిస్తాండాయి. దరుల నడుమ లోతుగా వున్నె వాగును సూస్తానే మాకు భయమేసింది. గాడేగు గురించి చానా కతలు వినుండాము. పెద్ద నక్కలు, తోడేల్లు, అడివి పందులూ, సుగాలి దెయ్యాలూ వంకలో ఓలలాడ తావుంటాయంట.

నాకు తెలిసీ యీన్నుంచి ఒక్కడుగు ముందుకు బేసేదుండదు. మరి రంగత్త గంప పేడతో నిండేదెప్పుడు?

బుట్టికెలు దించుకొని వాగు వొడ్డున కూకొన్నెం.

సదూకునే పిల్లోన్నెయి పేడకు వొచ్చినందుకు రంగత్త నన్ను పొగిడింది. మనకు బువ్వ బెట్టేది యీ పేడేనని చెప్పింది. పేడ దిబ్బలో పడాల దిబ్బ చేనిలో కలవాల. సత్తువై పైరును సాకాల. పంట పండాల. మనమా గింజలుతిని బతకాల. అంటే...పేడదినే మనం బతుకు తిందామని విడదీసి సెప్పింది. ఒక్క తపక గూడా పోనియ్యగూడదంట. కండ్లకద్దుకొని గంపలో బేసుకోవాలంట.

మేము పేడ కతలు యింటావున్నె సందట్లోనే గాడేగు అవతల బరకల్లోంచి ఎవురో వస్తాన్నెట్టు సన్నని రాగం యినపడ్నెది. కాసేపటికి అవతలిగెట్టున్నించి వాగులేకి దిగిన పెంచల్ మామ యివతలి గేటెక్కి మాకాడికొచ్చిండు. మమ్మల్ను జూసి ''పేడకొచ్చిన్రా? జాగర్తరోయ్. వాగులో పేడ దెయ్యాలుండాయి..'' అని సెప్పి వూరుదారిబయట వంక వైడెల్లో కంపచెట్ల సాటున మాయమయ్యిండు.

నాకు వొల్లులో పదరు మొదలైంది. పిచ్చిగాని కండ్లల్లో గూడా బెదరు కనబన్నెది. రంగత్త తప్ప బరకంతటికీ మాసే కనబల్లే. పెంచల్ మామ ఎనకే పోదామంటే తోడొచ్చిన అత్త గంపలో వొక్క పేడకడి గూడా లేదు. ఆమెనిడ్చి ఎట్లా పోవాల?

కాసేపున్నెంక లేచి నిలబడి సుట్టూ చూసింది రంగత్త. ''మీకేమో బుట్టల్నిండినయి. నా గంపకెట్లా?'' అనింది.

''బరకంతా తిరుగుదామా అత్తా!'' రాముడనెన్నడు.

''ఎందుకబ్బే! కాసేపు కూకోనుండండి. పేడ నేనేసుకోనొచ్చా...''

చెబుతా గంప అందుకొనింది. ''వంకలేకి దిగి నీల్ల గుండాలదాంకా పోయినాననుకో. గంపనిండు తది.'' అనింది.

గుండె జల్లుమనింది నాకు.

''దె..దెయ్యాలుంటాయేమోనే...''

నవ్వింది ఆమె. ''దెయ్యాలతో నాకు సావాస మేలే...'' అంటా వాగులేకి దిగింది.

అందరం వూపిరి బిగబట్టి సూస్తావుండాము.

వంకర టింకర వాగుదరుల కంచెట్ల సాటున లోతు వంకలో అత్త మాయమైంది. ఆమె ధైర్యం మాకు వణుకు పుట్టిస్తావుంది.

బిక్కు బిక్కుమంటా కూకున్నెం.

ఉన్నెట్టుండి జైగాడు అన్నెడు. '' ఒరే నాకొక డౌటురా'' అని.

అందరం వాని దిక్కు జూసినం.

''ఇన్ని గుండెలుండాయే రంగత్తకు.. యింత గడుసు పిండమే... మరి.. ఇంటికాడ లచ్చుమక్క దెబ్బకు వుచ్చబోసుకుంటాదంటనే...''

''అవున్రా!'' రాముడు కూడా వాని మాటను బలపరిచిండు.'' రోజూ మూడుగంపల పేడ తెచ్చే నేనంట బువ్వతిన్నిచ్చేది. ''రహస్యం విప్పిండు.

లచ్చుమక్క ఎవురోగాదు. రంగత్తకు అన్నభార్య వొదినె.

పంచన జేరిన ఆడబిడ్డను ఎప్పుడూ ఏడిపిస్తా వుంటాదంట ఆమె.

అందుకే పాపం రంగత్త పగులంతా ఇంటికాన్నే వుండదంట.

ఆమెకు ఇంటితోడు లేదు-బరకతోడు దప్ప.

ఆమెను గురించే మేం మాట్లాడుకొంటా వుండాము.

అప్పటికే మిట్టమద్దేన్నమయితా వుంది.

కడుపులో సన్నగా ఆకలి మొదలయ్యింది.

రంగత్త యింగా రాలే. వంకలేకి పోయి గంటసే పయ్యింటది.

ఆమెను దెయ్యాలేమైనా పీక్కతిన్నెయేమో!

ఆ మాట పిచ్చిగాడు అననే అనిండు.

అందరికీ లోపల్లోపలున్నె భయం బైటబడింది.

జైగాడయితే ఏడుపు మొగం పెట్టిండు.

నాగ్గూడా అరికాల్లల్లోంచి సన్నగా పదరు మొద లైంది.

చప్పుడుగా వుండా వుక్కమోసే ఎండపొద్దున. వూపిరాడని నడిమింటి పొద్దు జామున వంకలో దూరాన్నించి నక్కకూత 'వుయ్' మని వొచ్చి మా చెవుల్లో దూరేసరికి గుండెకాయలు అలిసిపోయి నయి.

మాకు దగ్గెరగా చెట్లల్లో పిట్టలు బుర్రు బుర్రున కదిలినయి.

దెయ్యాల మంద మా మీందికి గూడా వొచ్చే ట్టుంది.

గుండెలు లబలబలాడతా వుంటే వంకలేకి సూసినం.

వంకలో అలికిడి దగ్గెరయ్యింది.

పక్కగా చెట్ల సాటున్నించి ముందుగా పేడ తప కల కొప్పె కనమడింది. గంపమీంద రాసిబోసిన ట్టుగా ఎండిన పేడను బేర్చుకొని గంపకిందుగా ఆడమనిసి వస్తావుంది.

ఆమె దెయ్యం కాదని, రంగత్తేనని తెలిసేసరికి మా ముందుకొచ్చి నిలబడింది.

అందరం చల్లబడినం.

గంపనిండా ఎంత నల్లటి పేడ! ఎంత మంచి పేడ!!

''ఎట్టొచ్చిందత్తా యీ పేడంతా?'' అడిగిన.

''వంకలో పేడ దెయ్యాలుండాయబ్బీ! ''చెప్పింది నవ్వుతా. ''ఆడమాసి గుండెనిబ్బరం జేసుకొని వాగులో దిగుతే గంపెడు పేడ అయ్యే యేరకొచ్చి యిస్తాయి...''

మాకు తెలకుండానే మా కండ్లు వాగులేకి మల్లి నయి- ఆమె ఎనక వొచ్చుంటాయి గదా దెయ్యాలు.

నా కయితే యిచిత్రంగా వుంది.

బయం కొద్ది అందరం పేడబుట్టలు నెత్తికెత్తు కొన్నెం.

ఇంటి దారి బట్టినం.

వాగులో దెయ్యాల కతలు చెవుల్లో కిర్రుమంటాంటే రంగత్త మెడేలు తొక్కుతా నడవబట్టినం.

రంగత్త దెయ్యాల కతలు చెబుతా వుంది.

కొరివి దెయ్యాలు, సుగాలి దెయ్యాలు, ఆడ, మగదెయ్యాలు, గుడ్ల దెయ్యాలు, ఎనుము దెయ్యాల గురించి వినున్నెం గాని పేడదెయ్యాల పేరె ప్పుడూ విన్లే. ఆడమాసికేనంట అవి మేల్జేసేది. రంగత్త ఎనక గాడేగుదాకా రాకుంటే మేం గూడా నమ్మేవాల్లం గాదు.

''లెక్క దెయ్యాలుంటే ఎంత బాగుండు..'' పిచ్చి గాడు అననే అనిండు.

''పేడ దెయ్యాల మాదిరి లెక్క దెయ్యాలూ. లడ్డు దెయ్యాలూ, ఆ బువ్వ దెయ్యాలూ....''గొను క్కొంటానే వుండాడు.

వానింట్లో ఆ బువ్వ తినాలంటే బతుకంత పండగన్నా రావాల్నంట. సావంత రోగమన్నా రావాల్నంట.

రంగత్త నవ్వింది. ''యీ పిల్లోనికి తిండిపిచ్చి లెక్కపిచ్చి...యీ పిచ్చియిట్టనే వుంటే పెద్దయి నాంకె సెడిపోతావుబ్బీ!'' అనింది.

గాడేగు దూరమైందిగాబట్టి దెయ్యాల గురించి నిబ్బరంగానే మాట్లాడుకొంటాండాం.

ఉప్పువాగు దగ్గరికొచ్చేసరికి బరకలో కలవె చెట్ల సాటున వొంగుతా లేస్తా. పేడతపకలు యేరు కొని గంపలో బేసుకొంటా కనబన్నె మాసిని చూసి మేమంతా యిచిత్రబోయినం.

గంపమీంద కొప్పెరట్లా పేడనుగ్గులు బేర్చు కొని గాడేగు దాటొచ్చిన పెంచల్ మామ ఇప్పుడు వొట్టి గంపతో పేడ తపకల కోసరం ఎంపర్లాడతా వుండాడు.

ఇదే వింతబ్బా అనిపించింది.

నిలబడి అదేమాట అడిగినం. ''గంపెడు పేడా ఎట్టబాయె మామా?'' అని.

ఆయప్ప మా పక్క ఎగాదిగా సూసిండు.

''పేడదెయ్యం తీసప్పోయిందంర్రా!'' అన్నెడు.

ఉలిక్కిపడి అత్త దిక్కు చూసినం.

ఆమె నిలబడకుండా వూరిదిక్కు పోతానేవుంది.

''గాడేగు దాటొచ్చినోన్ని యింటికి పోయింటే మరియాదుండు. గంపమీంద కొప్పును యింగా పెంచి నైసుగా వూరేగుదామని నాలగు పేడ కాండ్లకు కక్కుర్తిబడి వాగులేకి దిగినాన్రా! పేడ దెయ్యం సుడిదిరుగుతావొచ్చి నా గంపెడు పేడా మాయం జేసింది. మీకు బుద్ధి జెప్పి నేను గడ్డిది న్నే..'' చెప్పిండు మామ.

వాగులేకి దిగిన ఏ మొగోని గంపలో పేడ యినా మాయం జేస్తాయంట పేడ దెయ్యాలు. ఆడోల్ల గంపలకు మాత్రం పేడను యిస్తాయంట.

విచిత్రంగా వుంది.

ఏదేమైనా మంచిదెయ్యాలే అవి.

ఊర్లేకి పోతావుంటే తొట్టి బాయి కాడ చెట్టు నీడలో కూకోనున్న రామతులసి, ఆయమ్మి సావాస

''గాడేగు దాటొచ్చినోన్ని యింటికి పోయింటే మరియాదుండు. గంపమీంద కొప్పును యింగా పెంచి నైసుగా వూరేగుదామని నాలగు పేడకాండ్లకు కక్కుర్తిబడి వాగులేకి దిగినాన్రా! పేడదెయ్యం సుడిదిరుగుతావొచ్చి నా గంపెడు పేడా మాయం జేసింది. మీకు బుద్ధి జెప్పి నేను గడ్డిదిన్నే..'

గత్తెలు కనబన్నెరు.

వాల్లముందు నీలుక్కొని నడిచినం.

బరుక్కుపోయి ఆవు పేడ దెచ్చినామంటే పోతు మొగోల్ల కిందనే లెఖ్క గదా!- అందులోనూ గాడేగు దాకా పోయి.

తొట్టిబాయి సుట్టుపక్కల పుర్రుపేడ చేసుకొనే ఆడంగిలోల్లం కాదు గదా! పేడదెయ్యాన్ని సూడ కున్నే దాని దగ్గెరికి పోయొచ్చినోల్లం దాని చేస్టాలు తెలుసుకున్నోల్లం గదా!.. పాలెగాల్లమే గదా!

ఆవుపేడ తెచ్చినామేగాని పేడదెయ్యం కతేందో మాకు సరిగ్గా అర్థంగాలే. ముసిలోల్లను అడిగితే కిసుక్కున నవ్వుతారే గాని అసలు సంగతి చెప్పిసావరు.

మామగంపలో పేడ మాయం చెయ్యడం... అత్త గంపను పేడతో నింపడం.. యీ పేడదెయ్యం చేస్టాలు చానా యేండ్లదాకా మాకు తెలిసిరాలే. మూతిమీద మీసాలు మొలిచేదాకా ఆ గుట్టేందో విడిపోయి కనబల్లే.

నిజమే...రంగత్తలాంటోల్లు బాయిలో దూకో.. వరుసుకొనో మందుదాగో సావకుండా బతికుండా రంటే ఏదొక పేడదెయ్యం తోడుండబట్టే గదా!

★